సాక్షి కామారెడ్డి

గురువారం ౹ 16 ౹ ఫిబ్రవరి ౹ 2023



బీజేపీతోనే అభివృద్ధి

బీజేపీతోనే తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార పేర్కొన్నారు.

- 8లో ▸



వ్యసనాలకు బానిసకావొద్దు

జిల్లాలోని పలు ప్రాంతాలలో బుధవారం డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

- 9లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 34.4 /8.0

ఉదయం చలి గాలులు వీస్తాయి. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరుగుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది. మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

'పన్నులు చెల్లించకపోతే సీజ్ చేస్తాం'



కామారెడ్డి టౌన్: కమర్షియల్ వెహికిల్స్‌కు సంబంధించిన త్రైమాసిక పన్నులు చెల్లించకపోతే వాహనాలను సీజ్ చేస్తామని జిల్లా రవాణా శాఖ అధికారి వాణి హెచ్చరించారు. బుధవారం జిల్లా రవాణా కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. పన్నుల వసూళ్ల కోసం స్పెషల్ డ్రైవ్ కొనసాగుతుందన్నారు. త్రైమాసిక పన్నులు చెల్లించని వాహనాలు తనిఖీల్లో పట్టుబడితే 200 శాతం జరిమానా విధిస్తామన్నారు. వాహనదారులు ముందుగానే తమ వాహన త్రైమాసిక పన్ను చెల్లించాలని సూచించారు. సమావేశంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్స్ శ్రీనివాస్‌రెడ్డి, సుభాష్, లక్ష్మణ్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

5,463 మందికి కంటి పరీక్షలు

కామారెడ్డి టౌన్: జిల్లాలో బుధవారం కంటి వెలుగులో 5,463 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 680 మందికి అద్దాలను పంపిణీ చేశారు. జిల్లాలో ఇప్పటివరకు 99,300 మందికి కంటి పరీక్షలు చేశామని వైద్యాధికారులు తెలిపారు. 17,088 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశామన్నారు.

'వందశాతం పన్నులు వసూలు చేయాలి'



కామారెడ్డి రూరల్: గ్రామ పంచాయతీలలో ఈ నెలఖరు వరకు వంద శాతం పన్నులు వసూలు చేయాలని డీపీవో శ్రీనివాస్‌రావు ఆదేశించారు. బుధవారం చిన్నమల్లారెడ్డి గ్రామంలో ఆయన పర్యటించారు. పంచాయతీ రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం పల్లె ప్రగతి పనులను పరిశీలించారు. పల్లె ప్రకృతి వనంలో మొక్కలను ఎండిపోకుండా ఉదయం, సాయంత్రం నీళ్లు పట్టాలని సూచించారు. ఆయన వెంట సర్పంచ్ కృష్ణాజీగారి రత్నబాయి ఆనంద్‌రావు, ఎంపీవో మలహరి, గ్రామ కార్యదర్శి మౌనిక, కారోబార్ శ్రీనివాస్ ఉన్నారు.

ఈవీఎం గోదాం పరిశీలన



కామారెడ్డి టౌన్: ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు కామారెడ్డిలోని ఈవీఎం గోదాంను బుధవారం నోడల్ అధికారులు పరిశీలించారు. పాండిచ్చేరి డిప్యూటీ సీఈవో బి.తిల్ల ఈవెల్, తమిళనాడు డిప్యూటీ సీఈవో వి.శ్రీధర్ కామారెడ్డికి వచ్చి ఈవీఎం గోదాంను సందర్శించారు. రికార్డులను, సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. వారి వెంట కలెక్టర్ జితేష్ వి పాటిల్, అదనపు కలెక్టర్ చంద్రమోహన్, జిల్లా ఎన్నికల విభాగం పరిశీలకుడు సాయి భుజంగరావు, డిప్యూటీ తహసీల్దార్ ఇంద్ర ప్రియదర్శిని, అధికారులు ఉన్నారు.

'ఇంటర్ ప్రాక్టికల్స్' ప్రారంభం

కామారెడ్డి టౌన్: జిల్లాలో బుధవారం ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఉదయం జనరల్ గ్రూప్‌లలో 890 మంది విద్యార్థులకుగాను 847 మంది పరీక్షకు హాజరయ్యారు. వొకేషనల్ 566 విద్యార్థులకుగాను 505 మంది ప్రాక్టికల్స్ పరీక్షకు వచ్చారు. మధ్యాహ్నం జనరల్‌లో 746 మంది విద్యార్థులకుగాను 713 మంది, వొకేషనల్‌లో 491 విద్యార్థులకుగాను 463 మంది హాజరయ్యారు. ఇంటర్ నోడల్ అధికారి షేక్ సలాం పరీక్షలను పర్యవేక్షించారు.

ప్రమోషన్లు ఇవ్వాలి



ఎల్లారెడ్డి: భాషా పండితులకు ప్రభుత్వం ప్రమోషన్లు కల్పించాలని హిందీ పండిత్‌లు కోరారు. మండలంలోని వెల్లుట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం వారు భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. హిందీ, ఉర్దూ, తెలుగు పండితులకు ప్రభుత్వం ప్రమోషన్లు కల్పించాలని, 14 ఏళ్లుగా ఒకేచోట పని చేస్తున్న ఉపాధ్యాయులను బదిలీలు చేయాలని డిమాండ్ చేశారు. నిరసనలో ఉపాధ్యాయులు ప్రకాష్, విజయ్ తదితరులు ఉన్నారు.

పోస్టుల భర్తీ ఎప్పుడో?

- సబ్‌స్టేషన్లలో వేధిస్తున్న ఆపరేటర్ల కొరత
- అదనపు డ్యూటీలతో ఇబ్బందులు

సబ్‌స్టేషన్లలో ఆపరేటర్ల పోస్టుల వివరాలు..

జిల్లాలో సబ్‌స్టేషన్లు	ఆపరేటర్ పోస్టులు	ప్రస్తుతం ఉన్నవారు	ఖాళీలు
157	628	336	292



బాన్సువాడ టౌన్: విద్యుత్ సబ్‌స్టేషన్లలో ఆపరేటర్ల కొరత తీవ్రంగా ఉంది. దీంతో ఉన్నవారిపై పనిభారం పెరిగింది. కరెంటు కట్ చేయాలన్నా, సరఫరాను కొనసాగించాలన్నా కీలకంగా వ్యవహరించే వీరిపై పని భారం పెరగడంతో ఒత్తిడికి గురవుతున్నారు. ఇంజినీరింగ్, కార్యాలయ అసిస్టెంట్ వంటి పోస్టులతో పాటు సబ్‌స్టేషన్ ఆర్టిజన్(ఆపరేటర్) కొలువుల భర్తీ చేపట్టకపోవడంతో క్షేత్ర స్థాయిలో ఇబ్బందికర పరిస్థితులున్నాయి.

జిల్లాలో 157 విద్యుత్ సబ్ స్టేషన్లు ఉండగా.. 628 మంది ఆపరేటర్లు అవసరం. కానీ ప్రస్తుతం 336 మంది మాత్రమే అందుబాటులో ఉన్నారు. దాదాపు సగం పోస్టులు ఖాళీగా ఉండడంతో ఉన్న వారిపై పనిభారం పడుతోంది. సబ్ స్టేషన్ల నిర్వహణలో ఆపరేటర్లు కీలక పాత్ర పోషిస్తారు. విద్యుత్ సరఫరా ఆన్ ఆఫ్ చేయడం, గంటగంటకూ రీడింగ్ రిపోర్టు నమోదు చేసుకోవడం, విపత్తు సమయంలో అప్రమత్తంగా ఉండడం, సబ్ స్టేషన్లలోని ట్రాన్స్‌ఫార్మర్లలో ఎడ్జ్ ఫీజులు పోయినప్పుడు వాటిని సరి చేసుకోవడం వంటి విధులను నిర్వహిస్తారు. విద్యుత్ సమస్య పరిష్కారం కోసం కొత్తగా సబ్‌స్టేషన్లు ప్రారంభిస్తున్న సర్కారు.. ఆరేడేళ్లుగా సిబ్బంది నియామకంపై దృష్టి సారించకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఒక్కో సబ్ స్టేషన్‌లో నలుగురు ఆపరేటర్లు పనిచేయాల్సి ఉంది. ప్రతి ఆపరేటర్ ఎనిమిది గంటల డ్యూటీ చేయాలి. కానీ సిబ్బంది కొరత కారణంగా ఇద్దరితోనే నెట్టుకువస్తున్నారు. దీంతో వారు 12 గంటలపాటు విధులు నిర్వహించాల్సి వస్తోంది. పలుచోట్ల సబ్‌స్టేషన్లు గ్రామాలకు దూరంగా ఉంటాయి. వాటిలో వాచ్‌మన్లు కూడా లేకపోవడంతో ఒక్కరే విధులు నిర్వహించాల్సి వస్తోంది. రాత్రి వేళల్లో సబ్‌స్టేషన్లలోని ట్రాన్స్‌ఫార్మర్‌లో ఉండే ఎడ్జ్ ఫీజు పోతే.. చీకట్లోనే మార్చాల్సిన పరిస్థితి. సబ్‌స్టేషన్లలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి పనిభారం తగ్గించాలని ఆపరేటర్లు కోరుతున్నారు.

ఒత్తిడి తగ్గించాలి



జిల్లాలోని సబ్‌స్టేషన్లలో ఆపరేటర్ల కొరత తీవ్రంగా ఉంది. చాలాచోట్ల ఒకరిద్దరికి మించి ఆపరేటర్లు లేరు. కొత్త వారిని తీసుకోవడానికి సంస్థ చొరవ చూపడం లేదు. దీంతో ఆర్టిజన్ల(ఆపరేటర్లు)పై పని భారం పెరిగింది. ఖాళీలు భర్తీ చేసి ఒత్తిడి తగ్గించాలి.

–హరికృష్ణ, విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ హెచ్–82 జిల్లా అధ్యక్షుడు

ఇబ్బంది పడుతున్నారు



నలుగురు ఆపరేటర్లు అవసరమైన చోట ఒకరిద్దరు మాత్రమే ఉండడంతో ఉన్నవారిపై అదనపు భారం పడుతోంది. దీంతో వారు ఇబ్బందిపడుతున్నారు. వాచ్‌మన్‌లూ లేరు. రాత్రి వేళ విధులు నిర్వహించే ఆర్టిజన్లకు ప్రమాదం జరిగితే చూసే దిక్కు కూడా లేదు.

–జిన్న దత్తు, విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ హెచ్–82 బాన్సువాడ డివిజన్ అధ్యక్షుడు

బాన్సువాడకు మరో గురుకులం

- ఎస్టీ బాలికల గురుకులాన్ని మంజూరు చేసిన సర్కారు
- హర్షం వ్యక్తం చేస్తున్న గిరిజనులు

బాన్సువాడ రూరల్: బాన్సువాడ నియోజకవర్గానికి మరో గురుకులం మంజూరైంది. ఎస్టీ బాలికల గురుకుల విద్యాలయాన్ని మంజూరు చేస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. హన్మాజీపేట్, కోనాపూర్‌ల మధ్య గురుకులాన్ని ఏర్పాటు చేయనున్నారు. వచ్చే విద్యాసంవత్సరంలో ఐదో తరగతి నుంచి ఇంటర్ వరకు తరగతులు ప్రారంభించనున్నారు.

నియోజకవర్గంలోని నస్రుల్లాబాద్ మండల కేంద్రంలో ఇప్పటికే గిరిజన బాలుర గురుకుల విద్యాలయం ఉంది. ఎస్టీ బాలికల కోసం మరో గురుకులాన్ని మంజూరు చేయాలని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరగా.. సీఎం సానుకూలంగా స్పందించారు. ఎస్టీ బాలికల గురుకులాన్ని మంజూరు చేశారు. 2023–24 విద్యా సంవత్సరానికిగానూ రికరింగ్ ఎక్స్‌పెండిచర్ కోసం రూ. 5.37 కోట్లు, నాన్ రికరింగ్ ఎక్స్‌పెండిచర్ కోసం రూ. 43.82 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. గిరిజనుల ఆరాధ్య గురువు శ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి రోజున గిరిజన గురుకులం మంజూరు చేస్తూ సీఎం కేసీఆర్ మంచి కానుక ఇచ్చారని బంజారా నాయకులు మోహన్‌నాయక్, సంగ్రాం నాయక్, కోనాపూర్, హన్మాజీపేట్ గ్రామాల సర్పంచ్‌లు వెంకటరమణారావు, బోనాల సుభాష్, ఎంపీటీసీలు హన్మాండ్లు, సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ భాస్కర్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

నాగన్నగారి బావి సందర్శన



నాగన్నగారి బావిని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ దంపతులు

లింగంపేట: మండల కేంద్రంలోని నగరేశ్వర, మత్తడి పోచమ్మ ఆలయాలను, నాగన్నగారి బావిని బుధవారం అదనపు కలెక్టర్ చంద్రమోహన్ భార్య రమాదేవితో కలిసి సందర్శించారు. ఆలయాలలో ప్రత్యేక పూజలు చేశారు. నగరేశ్వర ఆలయం ముందున్న చారిత్రక గాలికి ఊగే ధ్వజ స్తంభాన్ని పరిశీలించారు. ఆలయ విశిష్టతను పూజారి కృష్ణమూర్తి శర్మ అదనపు కలెక్టర్ దంపతులకు వివరించారు. అనంతరం జక్కాని నాగన్నగారి బావిని సందర్శించారు. బావి విశిష్టతను యువయూత్, రెడ్‌క్రాస్ మండల అధ్యక్షుడు బొల్లు శ్రీకాంత్ వారికి వివరించారు. సర్పంచ్ బొల్లు లావణ్య అదనపు కలెక్టర్ దంపతులను సన్మానించారు. జేసీ వెంట తహసీల్దార్ చంద్ర రాజేశ్వర్ తదితరులు ఉన్నారు.

ఘనంగా షబ్బీర్ అలీ జన్మదినం



షబ్బీర్‌అలీకి శుభాకాంక్షలు చెబుతున్న నాయకులు

కామారెడ్డి టౌన్: మాజీ మంత్రి షబ్బీర్ అలీ జన్మదిన వేడుకలను బుధవారం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని బ్లడ్ బ్యాంక్‌లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. తలసేమియా బాధితుల కోసం షబ్బీర్ అలీ అభిమానులు 190 మంది రక్తదానం చేశారు. వారందరికీ మాజీ మంత్రి ప్రశంస పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడారు. తనపై అభిమానంతో ఇంత పెద్ద ఎత్తున రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కై లాస్ శ్రీనివాస్‌రావు, పార్టీ నాయకులు గంప కృష్ణ, గుడుగుల శ్రీనివాస్, ఐరేని సందీప్ తదితరులు పాల్గొన్నారు.

'ఫిష్ పాండ్‌లను సద్వినియోగం చేసుకోండి'



గాంధారిలో ఫిష్ పాండ్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

గాంధారి: లబ్ధిదారులు ఫిష్‌పాండ్‌లను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. బుధవారం ఆయన మండల కేంద్రంలో పర్యటించారు. స్త్రీనిధి నిధులతో ఇళ్లలో ఏర్పాటు చేసుకున్న ఫిష్ పాండ్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు రైతులు పొలాల్లో ఫిష్ పాండ్‌లు ఏర్పాటు చేసుకుని చేపలను పెంచేవారన్నారు. ఇళ్లలో ఫిష్ పాండ్‌లు ఏర్పాటు చేసుకుని చేపలను పెంచడం కొత్త ఆలోచన అన్నారు. చేపలను పెంచి ఆదాయాన్ని పొందాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో పీడీ సాయన్న, జెడ్పీటీసీ శంకర్ నాయక్, ఎంపీపీ రాధాబలరాం నాయక్, సర్పంచ్ సంజీవు, తహసీల్దార్ గోవర్ధన్, ఆర్‌ఐ నరసింహారెడ్డి, ఎంపీవో కిరణ్ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ రాష్ట్రం వచ్చాకే అభివృద్ధి

- స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి
- బిచ్కుందలో ఫోర్‌లేన్ రోడ్డు పనులకు శంకుస్థాపన



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీ బీబీ పాటిల్ , ఎమ్మెల్యే సింధే

బిచ్కుంద: తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాకే బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గాలు ఎంతో అభివృద్ధి చెందాయని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం బిచ్కుందలో కందర్‌పల్లి -బాన్సువాడ రోడ్డు ఫోర్‌లేన్ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక జుక్కల్ నియోజక వర్గంలో రూ. 450 కోట్లతో రోడ్లు నిర్మించామన్నారు. బిచ్కుందలో ఫోర్‌లేన్ కోసం ప్రభుత్వం రూ.12 కోట్లు మంజూరు చేసిందన్నారు. సొంత స్థలం ఉంటే ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ. 3 లక్షలు ఇస్తుందని తెలిపారు. దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జుక్కల్ నియోజకవర్గ రైతులు సోయాబీన్ ఎక్కువగా సాగు చేస్తారని, ఈ నేపథ్యంలో సోయా ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలని రైతులు, ప్రజాప్రతినిధులు కోరుతున్నారని పేర్కొన్నారు. ఈ విషయాన్ని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకువెళ్లి యూనిట్ మంజూరుకు కృషి చేస్తానన్నారు. అనంతరం లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. సేవాలాల్ జయంతిలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ జితేష్ వి పాటిల్, డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, ఎంపీపీ అశోక్ పటేల్, జెడ్పీటీసీ నాల్చర్ భారతి, ఆర్డీవో రాజుగౌడ్, నాయకులు దఫేదార్ రాజు, పోచారం సురేందర్‌రెడ్డి, హరీశ్ సింధే తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని నీతి ఆయోగ్ నివేదిక ఇవ్వడంతో రాష్ట్రానికి ఎన్నో అవార్డులు వచ్చాయని ఎంపీ బీబీ పాటిల్ పేర్కొన్నారు. గతంలో ఉన్న ఎమ్మెల్యేలు గ్రామాలకు రోడ్లు, తాగునీటి సౌకర్యం కూడా కల్పించలేకపోయారని ఎమ్మెల్యే హన్మంత్ సింధే విమర్శించారు. తెలంగాణ వచ్చాక జుక్కల్ నియోజకవర్గాన్ని రూ. వేల కోట్లతో అభివృద్ధి చేశామన్నారు. ఇంకా 11 గ్రామాలకు బీటీ రోడ్లు వేయాల్సి ఉందన్నారు. మద్నూర్, పిట్లంలలో డిగ్రీ కళాశాల, బిచ్కుందలో పీజీ కళాశాల, జుక్కల్, నిజాంసాగర్, పెద్దకొడప్‌గల్, డోంగ్లీలలో ఇంటర్ కళాశాలలు ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. సీఎంతో మాట్లాడి కళాశాలలు, రోడ్లు మంజూరు చేయించాలని స్పీకర్‌ను కోరారు. నిజాంసాగర్ ప్రాజెక్టు, మిర్జాపూర్ హనుమాన్ మందిరం, కౌలాస్ కోట, చిన్నకొడప్‌గల్‌లోని రామలింగేశ్వర ఆలయాలను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేసేలా చూడాలన్నారు. త్వరలోనే సీఎంను కలిసి జుక్కల్ నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరతానని స్పీకర్ పోచారం హామీ ఇచ్చారు.

'లంపి స్కిన్' కలకలం..

- పశువుల్లో వ్యాపిస్తున్న వ్యాధి
- మృత్యువాత పడుతున్న ఆవులు
- ఆందోళన చెందుతున్న పశుపోషకులు
- పట్టించుకోని పశువైద్యాధికారులు

జిల్లాలో లంపి స్కిన్ వ్యాధి కలకలం రేపుతోంది. వైరస్ వేగంగా వ్యాప్తి చెందుతుండడంతో ఆవులు మృత్యువాతపడుతున్నాయి. పశువులు వ్యాధి బారిన పడుతున్నా అధికారులు మాత్రం స్పందించడం లేదు. దీంతో పశుపోషకులు ఆందోళన చెందుతున్నారు.



జిల్లా కేంద్రంలోని రాంమందిర్ వద్దనున్న ఆవులు..



లంపి స్కిన్ వ్యాధి సోకిన ఆవు

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని వీక్లీ మార్కెట్‌లో రెండు రోజుల క్రితం లంపి స్కిన్ వ్యాధి లక్షణాలతో ఓ ఆవు మృత్యువాత పడింది. కౌన్సిలర్లు ఇద్దరు పొక్లెయిన్ సాయంతో ఆవు కళేబరాన్ని దూరంగా తీసుకువెళ్లి పాతిపెట్టారు. బుధవారం రామారెడ్డి మండల కేంద్రంలో ఇదే వ్యాధి లక్షణాలతో మరో పశువు మృతి చెందింది. జిల్లా కేంద్రంలోని వీక్లీమార్కెట్, రాంమందిర్ ప్రాంతాలలో వందలాది ఆవులు, పశువులు ఉన్నాయి. వాటిలో చాలా ఆవులలో వ్యాధి లక్షణాలు కనిపిస్తున్నాయి. చర్మంపై దద్దులు వచ్చి రక్తం కారుతోంది. చాలా పశువులు ఒకేచోట ఉండడంతో మిగతా వాటికీ వైరస్ సోకుతోంది. గురువారం జిల్లాకేంద్రంలోని వీక్లీ మార్కెట్‌లో వారాంతపు సంత జరుగుతుంది. జిల్లా నలుమూలల నుంచి పశువులను తీసుకువచ్చి క్రయవిక్రయాలు జరుపుతారు. దీంతో వైరస్ వ్యాప్తి ఉధృతి పెరిగే అవకాశాలున్నాయని భావిస్తున్నారు.

వ్యాపించకుండా చర్యలేవి?

జిల్లా కేంద్రంలోని వీక్లీ మార్కెట్‌లో పశువైద్యశాఖ కార్యాలయం ఉంది. ఇదే ప్రాంతంలో చాలా పశువులు లంపి స్కిన్ వ్యాధి బారిన పడుతున్నా పశువైద్యులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. వ్యాధి వ్యాప్తి ఉధృతి పెరగకముందే అధికారులు స్పందించి, వ్యాధి నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. వ్యాధి సోకిన వాటిని గుర్తించి చికిత్సలు చేసి మిగతా పశువులకు సోకకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

పశువు మృత్యువాత



లంపి స్కిన్ లక్షణాలతో మృతి చెందిన దూడ

రామారెడ్డి(ఎల్లారెడ్డి): రామారెడ్డి మండల కేంద్రానికి చెందిన ఒద్దె పెద్ద బాలయ్య దూడ బుధవారం లంపి స్కిన్ లక్షణాలతో బుధవారం మృతి చెందింది. దూడకు నల్లని మచ్చలు పుట్టి మూత్రం నుంచి రక్తం వచ్చిందని బాధితుడు తెలిపాడు. మూడు రోజులుగా టీకాలు ఇచ్చినప్పటికీ ఫలితం లేకపోయిందన్నాడు. దూడను పూడ్చిపెట్టారు. దీనిపై డాక్టర్ రమేశ్‌ను సంప్రదించగా దూడ లంపిస్కిన్ లక్షణాలతో చనిపోయిందని కచ్చితంగా చెప్పలేమన్నారు. తమకు సమాచారం ఇచ్చి ఉంటే నిర్ధారణ పరీక్షలు నిర్వహించేవారిమన్నారు.

సమాచారం ఇవ్వాలి



జిల్లాలో ఇప్పటికే అన్ని పశువులకు వ్యాక్సిన్ వేయించాం. ఇటీవల కామారెడ్డి, రామారెడ్డి, డోంగ్లీతో పాటు అక్కడక్కడ లంపి స్కిన్ సోకుతున్నట్లు గుర్తించాం. వ్యాధి సోకినట్లు గుర్తిస్తే వెంటనే పశువైద్యులకు సమాచారం ఇవ్వాలి. వెంటనే వైద్య సేవలు అందిస్తాం. వ్యాధి సోకిన పశువులను వేరుగా ఉంచాలి.

– భరత్, జిల్లా పశువైద్యాధికారి, కామారెడ్డి

'భూగర్భ జలాలను సంరక్షించుకోవాలి'



మాట్లాడుతున్న సతీశ్ యాదవ్

బీబీపేట: భూగర్భ జలాలను సంరక్షించుకోవడంతోపాటు పెంపొందించుకోవడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా భూగర్భ జలశాఖ అధికారి సతీశ్ యాదవ్ కోరారు. బుధవారం మండల కేంద్రంలో భూగర్భ జలాల నిర్వహణ, పెంపుదలపై రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షపు నీరు వృథాగా వెళ్లకుండా చర్యలు చేపట్టాలన్నారు. చెక్‌డ్యాంలు, కందకాలు, ఇంకుడు గుంతలను నిర్మించుకోవాలని సూచించారు. వాటర్ షెడ్ గురించి ప్రాజెక్టర్ ద్వారా వివరించారు. ఉపాధి హామీ ద్వారా భూగర్భ జలాలు పెంచుకొనే పనులు చేపట్టాలని జెడ్పీ వైస్ చైర్మన్ ప్రేమ్‌కుమార్ సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు ప్రసాద్, ప్రభాకర్, ఎంపీటీసీ రవి, జిల్లా వ్యవసాయాధికారి భాగ్యలక్ష్మి, ఏవో పవన్‌కుమార్, ఏపీఎం బాలపోచయ్య, రిలయన్స్ ఫౌండేషన్ డైరెక్టర్ శరణ్య, నాయకులు నాగరాజ్‌గౌడ్, వినయ్ పాల్గొన్నారు.

శనగ కొనుగోలు కేంద్రం ప్రారంభం



డోంగ్లీలో శనగ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ పాటిల్, ఎమ్మెల్యే సింధే

మద్నూర్: శనగ కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యే హన్మంత్ సింధే సూచించారు. బుధవారం డోంగ్లీ మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయ ఆవరణలో శనగ కొనుగోలు కేంద్రాన్ని వారు ప్రారంభించారు. క్వింటాలుకు రూ. 5,335 మద్దతు ధర లభిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మాధవి పటేల్, ఎంపీటీసీ దీన్‌దయాళ్, డీసీసీబీ డైరెక్టర్ శ్రీరాం పటేల్, నాయకులు అశోక్ పటేల్, శశాంక్ పటేల్, శంకర్ పటేల్, దిగంబర్ పటేల్, బాబు పటేల్, ఆనంద్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రశాంతంగా ఇంటర్ ప్రాక్టికల్స్



నిజామాబాద్అర్బన్: ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా జరిగాయి. 41 పరీక్షా కేంద్రాల్లో ఉదయం మొత్తం 3,632 మంది విద్యార్థులకు గాను 3,378 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం 2,955 మందికి 2,767 మంది హాజరైనట్లు ఇంటర్ జిల్లా విద్యాధికారి రఘురాజ్ తెలిపారు. జనరల్ విద్యార్థులకు 35, వొకేషనల్ విద్యార్థులకు ఆరు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. పలు పరీక్ష కేంద్రాలను జిల్లా ఇంటర్ విద్యాధికారి రఘురాజ్, పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు రవికుమార్, చిన్నయ్య,కనక మహాలక్ష్మి, హైపవర్ కమిటీ సభ్యుడు రజియుద్దీన్, ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీ చేశారు.

గిరిజనుల ఆరాధ్య దైవం సేవాలాల్



ఖలీల్‌వాడి: గిరిజనుల ఆరాధ్యదైవం సేవాలాల్ మహారాజు అని వైఎస్సార్ తెలంగాణ పార్టీ జిల్లా అధ్యక్షుడు బుస్సాపూర్ శంకర్ అన్నారు. శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా బుధవారం ఎస్టీ రెసిడెన్షియల్ ట్రైబల్ వెల్ఫేర్ కాలేజీలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మోహన్‌నాయక్, ఆనంద్, మేఘవత్ దినేష్‌నాయక్, లాలూనాయక్, సాయిలు, పాండు, రమేష్‌నాయక్, లాల్ సింగ్, సంతోష్ పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల పనులు పునఃప్రారంభం



సాక్షి ఎఫెక్ట్..

నాగిరెడ్డిపేట: నాగిరెడ్డిపేట మండల కేంద్రం గోపాల్‌పేటలో గిరిజన బాలుర గురుకుల పాఠశాల భవన నిర్మాణ పనులు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి.'సాక్షి' దినపత్రికలో ఈ నెల 06న 'బడి నిర్మాణం పూర్తయ్యేదెన్నడో' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు పాఠశాల పనులను వెంటనే ప్రారంభించాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించినట్లు తెలిసింది. ఈ క్రమంలో బుధవారం పాఠశాల భవనం పనులు ప్రారంభమయ్యాయి.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



బాన్సువాడ టౌన్: బీర్కూర్ మండలం దామరంచ మంజీర నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న 19 ట్రాక్టర్లను పట్టుకుని పోలీసులకు అప్పగించినట్లు తహసీల్దార్ గంగాధర్ తెలిపారు. అనుమతులు లేకుండా మంజీర నుంచి ఇసుకను బాన్సువాడకు తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకున్నామని చెప్పారు. అక్రమంగా ఇసుక తరలించే ట్రాక్టర్ల యజమానులపై కేసులు నమోదు చేస్తామన్నారు.

గుట్టలు మాయం!

- పోడు హక్కుల కోసం అడవులకు కీడు
- పట్టించుకోని అధికారులు



పోడు కోసం నరికి వేసిన చెట్లు



చదును చేసిన అటవీ భూమి

ఇందల్వాయి: రెవెన్యూ, అటవీ శాఖ అధికారుల మధ్య సమన్వయ లోపంతో విలువైన భూములు అన్యాక్రాంతం అవుతున్నాయి. ఇందల్వాయి మండలం గన్నారం రెవెన్యు శివారులో జాతీయ రహదారి పక్కనే ఉన్న 1223 సర్వే నంబరులో భూబకాసురులు యథేచ్ఛగా చెట్లను నరుకుతూ గుట్టలను చదును చేస్తున్నారు. పదుల ఎకరాల్లో పచ్చని చెట్లను నరుకుతున్నా అధికారులు కన్నెత్తి చూడకపోవడంతో అక్రమార్కుల ఆగడాలకు అంతే లేకుండా పోతుంది. రెవెన్యూ, అటవీ శాఖల అధికారులు తెలిపిన వివరాల ప్రకారం 1223 సర్వే నంబరులో మొత్తం 228.22 ఎకరాల భూమి ఉంది. తూపంల్లి కప్పల వాగు, డొంకల్ చిన్నరాయ చెరువు, గన్నారం జోర్‌నాథ్ చెరువు, ఇందల్వాయి ఎర్రకుంట, ముత్యాలవాగులో అటవీ భూమి పోయినందుకు 2001లో అప్పటి కలెక్టర్ శశాంక్ ఆధ్వర్యంలో 1223 సర్వే నంబరులో అటవీ శాఖకు 193 ఎకరాలు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కానీ ఇప్పటి వరకు అధికారుల నిర్లక్ష్యంతో కేటాయించిన భూమి అధికారికంగా అటవీ శాఖ ఆదీనంలోకి రాలేదు. జాయింట్ సర్వే నిర్వహించినా హద్దులు గుర్తించడం లేదు.

సమన్వయ లోపం

అటవీశాఖకు కేటాయించిన 193 ఎకరాలు పోను మిగతా 35.22 ఎకరాలకు పట్టాలు ఇవ్వాల్సి ఉండగా హద్దులు తేలని భూముల్లో రెవెన్యు అధికారులు ఎలాంటి ఆధారాలు లేకుండా రెట్టింపు భూమికి పట్టాలు కేటాయించారు. అంతేకాకుండా మరింత విస్తీర్ణానికి కొత్తవారి పేర్లను ధరణిలో నమోదు చేశారు. దీంతో పట్టా పుస్తకాలు ఉన్నవారు, డిజిటల్ సంతకాలు కాకుండా రికార్డుల్లో ఉన్నవారు ధరణి రికార్డులను అడ్డు పెట్టుకొని పోడు హక్కులు వస్తాయన్న ఆశతో వాల్టా చట్టాలను తుంగలో తొక్కుతూ ఎలాంటి అనుమతులు లేకుండా యథేచ్ఛగా కొండలని, గుట్టలని చదును చేస్తూ ప్రకృతిని నాశనం చేస్తున్నారు.

వివాదాస్పదంగా అధికారుల తీరు

అటవీ శాఖ కార్యాలయానికి కూతవేటు దూరంలో వేల సంఖ్యలో చెట్లు నరికివేతకు గురవుతున్నా సంబంధిత అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడం విమర్శలకు దారి తీస్తుంది. తిర్మన్‌పల్లి గ్రామానికి చెందిన ఓ రైతు తన పట్టా భూమిలో ఒక వేప చెట్టు పీకేస్తేనే వాల్టా చట్టం అంటూ 45 వేలు జరిమానా విధించిన రేంజ్ అధికారి, వేల సంఖ్యలో చెట్లను నరుకుతున్నా వారికి సాదా సీదా జరిమానాలతో సరిపెట్టడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇకనైనా భూ ఆక్రమాలను అడ్డుకొని విలువైన అటవి భూములను కాపాడాలంటూ పరిసర ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై అటవీ, రెవెన్యు శాఖ అధికారులను సంప్రదించగా సదరు భూమి తమది కాదంటే తమది కాదని సమాధానం ఇవ్వడం గమనార్హం.

'అభివృద్ధిని అడ్డుకోవడానికి కుట్ర'



ఆక్రమించి కట్టిన భవనం కొలతలు వేస్తున్న సిబ్బంది

భిక్కనూరు: మండల కేంద్రంలో జరుగుతున్న అభివృద్ధి పనులను అడ్డుకునేందుకు, ప్రజలన తప్పుదోవ పట్టించేందుకు కొందరు కుట్ర పన్నుతున్నారని భిక్కనూర్ సర్పంచ్ తున్కి వేణు అన్నారు. వారికి ఒక న్యాయవాది వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండల కేంద్రానికి చెందిన ఒక న్యాయవాది పాఠశాల ప్రహరీని ఆక్రమించి, భవనాన్ని నిర్మించడం ఎంత వరకు సమంజసమన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు విలేకరుల సమావేశాలు, సోషల్ మీడియాలో వీడియోలు పెడుతున్నారని ఆరోపించారు. గ్రామాభివృద్ధి కోసం జాతీయ రహదారికి ఇరువైపుల నిబందనల విరుద్ధంగా ఉన్న ఇళ్ల యజమానులు ముందుకువచ్చి తాము అక్రమంగా నిర్మించుకున్న కట్టడాలను కూల్చి వేసుకుంటున్నారని చెప్పారు. పేదలు వారు తాము కూల్చుకోలేమని చెబుతుండడంతో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో అక్రమ కట్టడాలను తొలగిస్తున్నామన్నారు. న్యాయవాది కుటుంబం దాదాపు 22 గజాల స్థలాన్ని ఆక్రమించుకుని పాఠశాల ప్రహరీ కూల్చి భవనం నిర్మించకుందని ఆరోపించారు. పాలకవర్గం, సిబ్బంది ప్రజల ముందర సదరు న్యాయవాది భవనాన్ని కొలతలు వేయగా దాదాపు 22 గజాల వరకు ఆక్రమించుకున్నట్లు తేలిందన్నారు. పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం మురికి కాలువల నిర్మాణం చేపడుతున్నామని ప్రజలందరూ సహకరించాలని ఆయన కోరారు. రోడ్డు వెడల్పు పనులు చేపడుతామని మూడు నెలల క్రితమే దండోరా వేశామని, ఎవరూ కూడా అభ్యంతరాలు చెప్పలేదన్నారు. తెలంగాణ ఉద్యమంలో అందరూ పాల్గొన్నారని కొందరూ న్యాయవాదులు తామే ఉద్యమం చేశామని ప్రగల్భాలు పలకడం మానుకోవాలని సూచించారు. అభివృద్ధిపై అక్రమ కట్టడాలపై బహిరంగ చర్చకు తమ పాలకవర్గం సిద్ధంగా ఉందన్నారు. అక్రమ కట్టడాల కూల్చివేతలపై వెనక అడుగు వేసే ప్రసక్తే లేదన్నారు. భిక్కనూరు బాలుర ఉన్నత పాఠశాల ప్రహరీపై భవనం నిర్మాణం చేపట్టిన న్యాయవాదిపై ఫిర్యాదు చేయాలని హెచ్‌ఎంకు సూచించామన్నారు. ఈ విషయాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి ఆక్రమణకు గురైన పాఠశాల భూమిని కాపాడుతామన్నారు.

ముగిసిన కబడ్డీ పోటీలు



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ ఎస్‌ఎఫ్‌ఐ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కబడ్డీ పోటీలు ముగిశాయి. బుధవారం సాయంత్రం వీసీ రవీందర్ క్యాంపస్ క్రీడా మైదానంలో కబడ్డీ ఆడి ఫైనల్ పోటీని ప్రారంభించారు. ఫైనల్‌లో జార్జిరెడ్డి జట్టు, కొమురంభీం జట్టు తలపడగా జార్జిరెడ్డి జట్టు గెలుపొందింది. వీసీ మాట్లాడుతూ ఆటల్లో పాల్గొనడం వల్ల క్రీడాకారుల్లో దాగి ఉన్న నైపుణ్యం వెలికి వస్తుందన్నారు. వర్సిటీ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ డైరెక్టర్ సంపత్, పీఆర్‌వో జమీల్ అహ్మద్, ఫిజికల్ డైరెక్టర్ బీఆర్‌నేత, ఎస్‌ఎఫ్‌ఐ వర్సిటీ కార్యదర్శి శ్రీశైలం, విద్యార్థి నాయకులు ప్రసాద్, సాయిప్రసాద్, సంధ్యారెడ్డి, వెంకటేష్, చిత్రు పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం



తెయూ(డిచ్‌పల్లి): క్రీడల్లో గెలుపు, ఓటమి సహజమని తెలంగాణ యూనివర్సిటీ వీసీ డి రవీందర్ అన్నారు. మూడు రోజులుగా తెయూ క్యాంపస్ మైదానంలో జరుగుతున్న తెలంగాణ యూనివర్సిటీ ఇంటర్ కాలేజీ క్రికెట్ టోర్నమెంట్ బుధవారం సాయంత్రం ముగిసింది. టోర్నీ విజేతగా తెయూ కళాశాల జట్టు, రన్నరప్‌గా ప్రభుత్వ గిరిరాజ్ డిగ్రీ కళాశాల జట్టు నిలిచినట్లు వర్సిటీ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ డైరెక్టర్ సంపత్ తెలిపారు. వీసీ డి.రవీందర్ విజేతలకు బహుమతులు అందజేశారు. పీఆర్‌వో ఎండీ జమీల్ అహ్మద్, ఫిజికల్ డైరెక్టర్ బీఆర్‌నేత పాల్గొన్నారు.

'బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు చేసిందేమీ లేదు'



మాట్లాడుతున్న కాటిపల్లి వెంకటరమణారెడ్డి

బీబీపేట: తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత పేద ప్రజలకు చేసిందేమి లేదని, వారి నెత్తిన అప్పుల మూట పెట్టారని బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జి కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంతో పాటు కోనాపూర్, యాడారం, ఇస్సానగర్, ఉప్పర్‌పల్లి, మల్కాపూర్, తుజాల్‌పూర్ గ్రామాల్లో ప్రజల గోస–బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా స్ట్రీట్ కార్నర్ మీటింగులు ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. స్వార్థపూరిత రాజకీయాల కోసమే బీఆర్‌ఎస్‌ను ఏర్పాటు చేశారని, డబుల్ ఇళ్లు నిర్మించి ప్రజలకు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. బీజేపీ నాయకులు రంజిత్‌గౌడ్, శ్రీనివాస్, నక్క రాజు, అల్లం ప్రవీణ్, సంతోష్‌గౌడ్, మల్లేషం పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

పెద్దకొడప్‌గల్: పెద్దకొడప్‌గల్ గ్రామానికి చెందిన ఓ యువతి అదృశ్యమైనట్లు ఏఎస్సై రాములు తెలిపారు. సోమవారం రాత్రి ఇంట్లో పడుకున్న యువతి మంగళవారం తెల్లవారుజామున లేచే సరికి కనిపించలేదు. పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించకపోవడంతో ఆమె తల్లి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

పసుపు, స్పైసిస్ బోర్డు ఒక్కటే

- రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం
- నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్

ఆర్మూర్: పసుపు బోర్డు, స్పైసిస్ బోర్డు ఒక్కటేనని, దీంతో పసుపు రైతులకు మంచి ఫలితాలు వస్తాయని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. ఆర్మూర్ పట్టణం పెర్కిట్‌లోని ఓ గార్డెన్స్‌లో బీజేపీ సీనియర్ నాయకుడు ఆలూర్ గంగారెడ్డి కూతురు విజయభారతి బీజేపీలో చేరిక కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై విజయ భారతికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ ఒకప్పుడు అభివృద్ధి కార్యక్రమాలలో హాజరు కావడానికి ఆలూర్‌కు రానివ్వకుండా కొందరు అడ్డుకుంటే ఇప్పుడు అదే ఆలూర్ గ్రామ ప్రజలు బీజేపీలో చేరడానికి తన వద్దకు రావడం సంతోషంగా ఉందన్నారు. ఆర్మూర్ నియోజకవర్గ ప్రజలను బెదిరింపులతో కట్టడి చేయలేరన్నారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని దీమా వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి చేసింది శూన్యమని విమర్శించారు. మున్సిపాలిటీలో విలీనం అయిన మామిడిపల్లి అభివృద్ధికి పది కోట్ల రూపాయలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చి నెరవేర్చలేదన్నారు. లోక భూపతిరెడ్డి, అల్జాపూర్ శ్రీనివాస్, పల్లె గంగారెడ్డి, నూతుల శ్రీనివాస్‌రెడ్డి, కంచెట్టి గంగాధర్, పుప్పాల శివరాజ్, జీవీ నర్సింహారెడ్డి పాల్గొన్నారు.



ఎంపీ అర్వింద్ సమక్షంలో బీజేపీలో చేరుతున్న విజయ భారతి

'రాజమ్మతండా' జీవన విధానంపై ఆరా

రామారెడ్డి: మండలంలోని రాజమ్మతండా ప్రజల జీవన విధానంపై సాక్షి పత్రికలో వచ్చిన కథనంతో పలువురు తండాను సందర్శిస్తున్నారు. బుధవారం వరంగల్ జిల్లా నుంచి రిటైర్ హెచ్‌ఎం మధుసూదన్‌రావు తండా సందర్శించి, వారి జీవన విధానం , మినరల్ వాటర్‌కు బదులుగా బోరు నీళ్ల తాగడం ఆరా తీశారు. వారికి వచ్చే వ్యాధులను తెలుసుకున్నారు. సాక్షి పేపర్లో చదవి రాజమ్మతండాకు వచ్చినట్లుగా సదరు వ్యక్తులు తెలిపినట్లు రాజమ్మ తండాకు చెందిన గోపాల్‌నాయక్ చెప్పారు. తమ జీవన విధానాన్ని రాష్ట్రవ్యాప్తంగా పరిచయం చేసిన 'సాక్షి'కి తండావాసులు కృతజ్ఞతలు తెలిపారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం



హండేకేలూర్‌లో మాట్లాడుతున్న అరుణతార

మద్నూర్: జుక్కల్ నియోజకవర్గానికి ఎమ్మెల్యే సింధే ఏం చేశారో అందరికి తెలిసిన విషయమేనని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార అన్నారు. మండలంలోని హండేకేలూర్‌లో బుధవారం ఆమె స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు అప్పటి ఎన్‌డీఏ ప్రభుత్వ సహకారంతో నియోజకవర్గంలో అభివృద్ధి చేశానన్నారు. ప్రతి గ్రామానికి రోడ్లు, అంగన్‌వాడీ సెంటర్లు, వాటర్ ట్యాంక్‌లు, సీసీ డ్రైన్‌లు ఇలా ఎన్నో అభివృద్ధి పనులు చేశామన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కేసీఆర్ కుటుంబం మాత్రమే అభివృద్ధి చెందిందని ఆరోపించారు. బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు హన్మండ్లు, వీరేశం, వెంకట్, అక్బర్, శ్రీనివాస్, లక్ష్మణ్, సురేష్, రమేశ్ ఉన్నారు.

రంగురంగుల కూరగాయలు

పసుపు రంగు క్యాలీ ఫ్లవర్, గులాబీ కలర్ ముల్లంగి, వంకాయ రంగు గోబిగడ్డ.. ఎంటీ ఈ రంగుల్లో ఆయా కూరగాయలు అనుకుంటున్నారా.. అవును నిజామాబాద్ మార్కెట్‌లో వివిధ రంగుల్లో కాయకూరలు ఆకట్టకుంటున్నాయి. కొందరు వ్యాపారులు సిర్‌పూర్, కాగజ్‌నగర్ నుంచి రంగు రంగుల కూరగాయలను తీసుకొచ్చి నగరంలో విక్రయిస్తున్నారు. వీటిని ఎక్కువగా ఇతర రాష్ట్రాలకు చెందిన వారు ఎక్కువగా కొనుగోలు చేస్తున్నట్లు అమ్మకందారులు చెబుతున్నారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్



పసుపు రంగులో ఆకట్టుకుంటున్న క్యాలీఫ్లవర్





ఆకుపచ్చ రంగులో క్యాలీఫ్లవర్



గులాబీ రంగులో ఉన్న ముల్లంగి

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



ఇందల్వాయి: టీవీఎస్ లూనాని కారు వెనక నుండి ఢీకొట్టిన ప్రమాదంలో మహిళ మృతి చెందడంతో పాటు పలువురికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ఘటన 44వ నంబరు జాతీయ రహదారిపై చంద్రాయన్‌పల్లి గ్రామ శివారులో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ధర్పల్లికి చెందిన పానేటి రాములు, సత్తెవ్వ(30) దంపతులు వారి కుమార్తె ప్రియతో కలిసి కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండలంలో జరిగిన బంధువుల పెళ్లికి వెళ్లి తిరిగి వస్తున్నారు. హైదరాబాద్ నుంచి వస్తున్న కారు వెనక నుంచి లూనాను ఢీకొంది. ప్రమాదంలో సత్తవ్వ ఘటనా స్థలంలోనే మృతి చెందగా ప్రియ కాలు విరగడంతో పాటు, రాములు, కారు డ్రైవర్ సునిల్ పరిస్థితి విషమంగా ఉంది. కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు మహిళలకు స్వల్ప గాయాలైనట్లు తెలిపారు. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు.

యువకుడి దారుణ హత్య



మోర్తాడ్: ఉపాధి నిమిత్తం మోర్తాడ్ వచ్చిన ఓ యువకుడు హత్యకు గురయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. బాన్సువాడకు చెందిన కనగల్లు వెంకట్(25) బతుకుదెరువు కోసంమోర్తాడ్ వచ్చాడు. ట్రాక్టర్ డ్రైవింగ్ చేస్తూ మరో స్నేహితుడితో కలిసి ఉంటున్నాడు. మంగళవారం రాత్రి వెంకట్ తన మిత్రుడు జల్సా శేఖర్‌తో కలిసి సుంకెట్ రహదారి పక్కన మద్యం తాగాడు. బుధవారం ఉదయం గేదెల కాపరులు వెంకట్ మృతదేహాన్ని చూసి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకొని విచారణ చేపట్టారు. మద్యం మత్తులో ఇద్దరి మధ్య గొడవ జరిగడంతో శేఖర్ హత్య చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. హత్యకు పాల్పడిన ఆయుధాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. నిందితుడు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

గంజాయి కేసులో నాలుగేళ్ల జైలు

ఖలీల్‌వాడి: గంజాయితో పట్టుబడిన ఒకరికి నిజామాబాదు మొదటి అదనపు సెషన్స్ జడ్జి శ్రీనివాస రావు బుధవారం నాలుగేళ్ల జైలు శిక్ష విధించారు. ఎక్సైజ్ జిల్లా సూపరింటెండెంట్ మల్లారెడ్డి తెలిపిన వివరాలు.. నగరానికి చెందిన షేక్ రిజ్వాన్ 1.3 కిలోల గంజాయితో 2018లో పట్టుబడ్డాడు. ఈ కేసులో బుధవారం జడ్జి నిందితుడికి నాలుగేళ్ల జైలు శిక్షతో పాటు రూ.30 వేల జరిమానా విధించారు. జరిమానా కట్టకపోతే అదనంగా 6 నెలల శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు.

దాడి చేసిన వారిపై కేసు

ఖలీల్‌వాడి: నగరంలోని కంఠేశ్వర్‌లో వైన్ షాపు పక్కన ఉన్న ఫాస్ట్ ఫుడ్ సెంటర్ వద్ద గొడవ జరిగినట్లు ఎస్సై శ్రావణ్ కుమార్ తెలిపారు. ఫాస్ట్ ఫుడ్ యాజమానితో పాటు ఇద్దరు వర్కర్స్‌కు మధుకర్ అనే వ్యక్తికి మధ్య గొడవ జరిగింది. దీంతో వారు మధుకర్‌ను తలపై కొట్టారు. మధుకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

మద్యానికి బానిసై ఒకరి ఆత్మహత్య

ఖలీల్‌వాడి: నగరంలోని శాస్త్రినగర్‌లోని పాల్టీఫారంకు చెందిన షేక్ మౌల ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. మౌల మద్యానికి బానిస కావడంతో ఆరోగ్యం క్షీణించింది. డాక్టర్‌ను సంప్రదించగా తాగుడు మానేయాలని సూచించాడు. ఈ క్రమంలో శాస్త్రినగర్ గోదాముల వెనుక మౌల ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య షేక్ ఫర్జన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకల్లో అపశ్రుతి

- విద్యుత్ షాక్‌తో యువకుడి దుర్మరణం
- మరో ఇద్దరికి తీవ్రగాయాలు



గణేశ్ (ఫైల్)



రోదిస్తున్న మృతుడి భార్య, చిన్నారులు

రుద్రూర్ : రుద్రూర్ మండలం సులేమాన్ నగర్ తండాలో సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాల్లో అపశ్రుతి చోటుచేసుకుంది. విద్యుత్ షాక్‌తో ఓ యువకుడు మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. కార్యక్రమంలో జెండా ఆవిష్కరణ చేసి అన్నదానం ప్రారంభించాల్సి ఉంది. పాత జెండాలు తొలగించి కొత్త జెండాలు కట్టారు. ఈ క్రమంలో ఐదుగురు ఇనుప రాడ్‌కు కట్టిన జెండాను పైకి లేపుతుండగా 11 కేవీ విద్యుత్ వైరుకు తగిలింది. దీంతో కరెంట్ షాక్ తగిలి ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. బోధన్ ఆస్పత్రికి తరలిస్తుండగా మూడ్ గణేశ్ అలియాస్ సుభాష్ (సుబ్బు) (28) మార్గమధ్యలో మృతి చెందాడు. మరో ఇద్దరు హరిశ్ నాయక్, శంకర్ నాయక్‌లు ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ట్రాన్స్‌కో, పోలీస్ సిబ్బంది ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవీందర్ తెలిపారు. మృతుడికి భార్య, రెండేళ్లలోపు ముగ్గురు పిల్లలు ఉన్నారు.అందులో ఇద్దరు కవలలు. మృతుడు ట్రాక్టర్ డ్రైవింగ్‌తో పాటు దినసరిగా కూలీగా పని చేసేవాడు. ఆనందంగా, హుషారుగా జరుపుకుంటున్న పండగలో సంభవించిన విద్యుత్ షాక్ ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది.